కాలాంతకురాలు!

వి. ఎస్. చెన్నూరి

బస్సు చాలా రద్దీగా వుంది. బస్సులో నిల్చుని ప్రయాణం చేస్తున్న ప్రయాణీకులు ఊపిరి సలపడానికి వీల్లేకుండా ఉక్కిరిబిక్కిరై పోతున్నారు.

మూర్తి ఒంటికాలిమీద నే నిల్చునివున్నాడు. రెండో కాలు ఎక్కడ పెట్టాలో తెలీక, ఒంటికాలిమీద బాలెన్సు కుదరక, చేతికి పట్టుందక నానా యాతన పడుతున్నాడు.

పంజాబీ డ్రెస్సు వేసుకున్న ఓ యువతి ఆసాంతం అతగాడిమీద వాలిపోయింది. ఆమె సున్నితమైన అవయవాలు అతగాడి వీపుని నొక్కుతున్నయ్. పాపం పట్టు చిక్కక కాబోలు ఆమె ఎడంచెయ్యి అతగాడి నడుముని వాటేసుకుంది.

"ఆహా! ఏం సుఖం! ఏం సుఖం! ఇంద్రభోగం అంటే యిదే కాబోలు!" అనుకున్నాడు మూర్తి.

మన పూర్వులు రంభ ఊర్వసుల పొందుకోసం

యజ్ఞాలూ యాగాలూ చేసేవారు. ఈనాడు యజ్ఞాలూ, యాగాలూ అవసరంలేకుండా బస్సు ప్రయాణాలు కని పెట్టారు ఆధునికులు!-

కదుల్తోన్న బస్సు తిన్నగా, వెళ్ళక చిన్నగా ఓ హై జంపు చేసింది. పక్కనున్న పంజాబీడ్రెస్సు పడతి మూర్తి కణతకు తలతో ఓ 'డీ' కొట్టింది. 'అమ్మ' అనబోయి సభ్యతగా వుండదని మానేసి పక్కకి తిరిగాడు మూర్తి.

పంజాబీడ్రెస్ పడతి "అయాం సారీ" అనేసి ఓ చిలిపి చూపూ ఓ చిరునవ్వూ విసిరేసి, సిగ్గుతో తల వొంచేసు కుంది.

"వాటెబ్యూటీ!" బోలెడు ఆశ్చర్యపోయాడు మూర్తి గుడ్లప్పజెప్పి ఆమెకేసే చూస్తూ.

అంత అందగత్తెను అతనెప్పుడూ చూళ్ళేదు. అంత మందిలో అలా చూడ్డం సభ్యతగా వుండదని దృష్టి మర ల్చాడు.

"అబిడ్స్! అబిడ్స్!" గంటకొట్టి గట్టిగా అరిచాడు కండక్టర్. ఆ అరుపుతో బస్సు ఆగిపోయింది.

బస్సులో తోపులాట ప్రారంభమైంది. వెనకనున్న జనం ముందున్న వాళ్ళని తోస్తున్నారు. దిగేవాళ్ళని దిగ నివ్వకుండా ఎక్కేవాళ్ళు ఎక్కేస్తున్నారు. అంతా కంగారు కంగారుగా వుంది.

ఆ కంగారులో అతగాడి పాంటుజేబులోకి ఏదో సున్నితమైన చెయ్యి ప్రాకింది. అనుకోకుండానే అతని కుడిచెయ్యి ఆ చేతిని పట్టుకుంది. కాని చెయ్యి ఇతగాడి చేతికి చిక్కకుండా జర్రున లాగేసుకుంది. ఆ చేతిలోంచి ఏదో చిన్న వస్తువు పాంటుజేబులోకి జారిపోయింది.

ఆకుపచ్చ పంజాబీడ్రెస్ యువతి బస్ దిగింది.

అనుకోకుండానే మూర్తి కూడా అక్కడే దిగి పోయాడు. ఆ యువతిని వెంటాడుతూ జనంలో కలిసి పోయాడు.

ఎంత వెదికినా ఆ యువతి కనిపించలేదతని కంటికి. పేవ్ మెంటుమీదికి చేరి, పాంటు జేబులోంచి ఎర్రరాయి పొదిగిన ఓ చిన్న సైజు వుంగరాన్ని బైటికి తీసి చూసి ఆశ్చర్యపోయాడు.

ఎంత సున్నితమైన చెయ్యది!- మెత్తగా పట్టు కుచ్చులా యెంత మృదువుగా వుందని! తామర తూడు ల్లాంటి వ్రేళ్ళు-ఆ వ్రేలికి అలంకరించిన ఈ వుంగరం ఎంత ముద్దొస్తోందని!

ఎవరూ తన్ను గమనించడంలేదని తెలుసుకొని ఆ వుంగరాన్ని ముద్దెట్టుకొన్నాడు.

ప్రక్కకి తిరగ్గానే దర్శనమిచ్చింది ఆకుపచ్చ సిల్కు పంజాబీ డ్రెస్ పడతి. ఇంత సేపూ తన్నే గమనిస్తోంది కాబోలు అనుకొన్నాడు మూర్తి.

ఆమె చకచకా వొయ్యారం వొలకబోస్తూ, వానిటీ బాగ్ని వూపుకొంటూ, ఎత్తుమడమల జోళ్ళు టకటక లాడిస్తూ, ఎదురుగా వున్న హోటల్లో దూరింది.

మూర్తి తన చేతినున్న ముద్దుటుంగరాన్ని పాంటు జేబులో కుట్టించుకొన్న సీక్రెట్ పాకెట్లో దాచి, చకచకా బూట్లు చప్పుడు చేసుకొంటూ ఆమె వెళ్ళిన హోటల్ కేసే నడిచాడు. హాల్లో ఆమెకోసం వెతికాడు. కాని ఆమె కనిపించలేదు. ఎదురుగా 'లేడీస్' అన్న బోర్డు తగిలించిన రూము కనిపించింది.

"హతోస్మి!" అనుకొంటూ అక్కడే ఖాళీగావున్న

ఓ కుర్చీలో కూలబడి, కాఫీకి ఆర్డరిచ్చి కౌంటర్ కేసి కళ్ళప్పగించి కూర్చున్నాడు.

ఐదు నిముషాలు దొర్లిపోయినయ్. పదినిమిషాలు - పావుగంట గడిచిపోయింది! కాఫీ తేవడానికి వెళ్ళిన ఛా సీ తిరిగి రాలేదు.

'అరి వీడిల్లు బంగారంగానూ! కాఫీగింజలకోసం ఆర్డరివ్వడానికి వెళ్ళాడు కాబోలు కాఫీతోటలికి-' అనుకొన్నాడు మూర్తి.

"కాఫీ తయారుగా లేదుసార్! చాయ్ తెమ్మంటారా" అంటూ వచ్చాడా సర్వర్.

"ఏదో ఒకటి తగలెట్టు!" అన్నాడు మూర్తి.

సర్వర్ వెంటనే పట్టుకొచ్చాడు టీ. మూర్తి టీ సిప్ చేస్తూ కౌంటర్ కేసే చూస్తున్నాడు. ఆకుపచ్చ రంగు పంజాబీ యువతి చకచకా కౌంటర్ దగ్గరకొచ్చి బిల్లు పే చేసి వొయ్యారం వొలకబోసుకొంటూ వెళ్ళిపోయింది.

మూర్తి కప్పులోని టీ కప్పులోనే వుంచేసి, కుర్చీలోంచి గబ గబా కౌంటర్ కేసి పరిగెత్తాడు. కౌంటర్లో బిల్లు పే చేసి పేవ్ మెంట్ మీదికి చేరుకొన్నాడు. ఆమెకోసం కళ్ళతోనే గాలించసాగాడు. కాని ప్రయోజనం కనిపించలేదు. ఆమె ఎటు మాయమైందో ఎక్కడా ఆమె జాడ కనిపించలేదు.

మూర్తి బరువుగా నిట్టూర్పు విడిచి, కాళ్ళీడ్చుకొంటూ పరధ్యానంగా పేవ్ మెంటుమీద నడుస్తున్నాడు.

అకస్మాత్తుగా ఢీకొనడంతో అమాంతం బోరగిలా పడబోయి, సంబాళించుకొని చతికిల పడ్డాడు. ఏవో రెండు సున్నితమైన చేతులు ఆసరా యివ్వడంతో లేచి నిల్చుని బట్టలు దులుపుకొని పక్కకి తిరిగాడు.

"అయాం వెరి సారీ మిస్టర్, తొందర్లో చూళ్ళేదు" ఆకుపచ్చరంగు పంజాబీ దుస్తుల పడతి ఓ చిరునవ్వూ, ఓ చిలిపి చూపూ చిలకరించి, అతి స్పీడుగా వెళ్ళిపోయింది ముందుకి.

ఈ ఆకస్మాత్ సంఘటనకి తల దిమ్మెక్కిన మూర్తి అందులోంచి బైటపడేసరికి ఆమె అల్లంతదూరం వెళ్ళిపోయింది. ఏదో గుర్తుకి రాగా పాంటుజేబు తడుముకొన్నాడు. జేబులో పర్సు మాయమైంది.

"ఎంత అందగత్తో అంత చలాకీ పిల్ల!" అనుకొన్నాడు.

వెంటనే అతనికి నవ్వొచ్చింది. ఆ పర్సు విప్పి చూడగానే ఆమెకు చిర్రెత్తుకొస్తుంది. తనమీద కసి పెరుగుతుంది. తాను వెంటపడకపోయినా, ఆమె తనవెంట పడడం ఖాయం!—

ఎందుకైనా మంచిది ఆమె వెంటపడి, ఆమె వునికిని తెలుసుకోవాలి!—అనుకొన్నాడు.

అల్లంతదూరంలో ఆమె ఓ ఆటోలోకి చేరడం కంటబడింది. వెంటనే పక్కన ఆగివున్న ఆటోలోకి చేరుకొని ముందు వెళుతున్న ఆటోని వెంబడించమన్నాడు మూర్తి.

ఆమె ఎక్కిన ఆటో తిన్నగా వెళ్ళి, కోఠీలో ఓ కాంపౌండు ముందు ఆగింది. ఆమె అందులోంచి దిగి ఆటో డ్రైవర్‌కి ఫేర్ చెల్లిస్తోంది.

మూర్తి తన ఆటోని ముందున్న ఆటోకి వందగజాల దూరంలో ఆపి, డ్రైవర్‌కి ఫేర్ చెల్లించి కాలినడకన కాంపౌండు కేసి బయలుదేరాడు.

కాంపౌండు గేటు మూసివుండడంవల్ల ఆమె ఎవరి కోసమో ఎదురుచూస్తూ గేటుముందు నిల్చుంది. మూర్తి ఆమెను సమీపించేసరికి గేటు కవతల కాపలావాడు గేటు తెరవడం, ఆమె లోపలికి వెళ్ళడం జరిగిపోయింది.

మూర్తి గేటు గోడపక్కన చీకట్లో నక్కాడు.

"నీకోసం రాజయ్య వొచ్చి వెళ్ళాడు బేబీ" అన్నాడు కాపలావాడు.

"ఎంత సేపయింది?" కిన్నెర మీటినట్టుందామె గొంతుక.

"అరగంట క్రితం! మళ్ళీ వొస్తానన్నాడు."

"వొస్తే వెంటనే పైకి పంపించు!"

"అలాగే బేబీ!"

ఆమె చకచకా నడిచి వెళ్ళిపోయింది. మూర్తి అక్కడే నిల్చుని రాజయ్యకోసం ఎదురుచూడసాగాడు. పది నిమిషాల్లో రాజయ్య కూడా అక్కడికి చేరుకొన్నాడు.

"బేబీ యిప్పుడే వచ్చిందయ్యా! మీదికెళ్ళు!" అన్నాడు కాపలావాడు మూసిన గేటు తెరుస్తూ.

రాజయ్య సన్నగా పొడుగ్గా గెడకర్రలాగా వున్నాడు. తెల్ల లాల్చీ, తెల్ల పైజామా తొడుక్కొన్నాడు. గిరిజాల జుట్టు, రొయ్యమీసాలు. అతని కళ్ళు ఎర్రగా మండుతున్నయ్. బాగా తాగాడేమో తూలుతూ నడుస్తున్నాడు.

రాజయ్య లోపలికి వెళ్ళిం తరువాత మూర్తి చిన్నగా నిట్టూర్పు విడిచి మెల్లగా అక్కడ్నించి కదిలాడు.

2

మూర్తి పూర్తి పేరు సుందరమూర్తి. యువకుడు. అందగాడు. బాగా చదువుకొన్నవాడు. ఇంతక్రితం ఓ

ప్రైవేట్ కంపెనీలో అసిస్టెంటు మేనేజరుగా పనిచేసి అనుభవం గడించినవాడు. ప్రస్తుతం ఓ పేరుమోసిన ప్రైవేటు సంస్థనుండి మేనేజరుగా, ఎపాయింటుమెంటు ఆర్డర్స్ అందుకొని, డ్యూటీలో జాయిన్ అవడానికి విజయవాడనుండి హైదరాబాద్ చేరుకొని ఓ మధ్యరకం హోటల్లో గది తీసుకొన్నాడు.

నిన్ననే ఆఫీసుకెళ్ళి రిపోర్టు చేశాడు. కాని తనకి డ్యూటీ హేండోవర్ చెయ్యవలసిన వ్యక్తి టూర్‌లో ఉండడంవల్ల డ్యూటీలో జాయిన్ కాలేకపొయ్యాడు. అతడు టూర్‌లోంచి హెడ్‌క్వార్టర్స్‌కి తిరిగిరావడానికి వారంరోజులు పడుతుందట. అంతవరకు అతను ఖాళీ. ఖాళీగా వుండడం ఎందుకని జంటనగరాల్లోని వింతలూ విశేషాలూ కవర్ చేస్తున్నాడు.

మూర్తికి ఒక్క ఆడవాళ్ళ విషయంలో కాస్త బలహీనత వుండడం నిజమేగాని, యితర దుర్వ్యసనాలేవీ లేవు. ఆడవాళ్ళ విషయంలోకూడా ఆవిడ అలాంటిదని తోస్తే తప్ప ఆ ప్రయత్నానికి పూనుకోడు.

పైసల విషయంలో అతడు జాగ్రత్తగా వుంటాడు. ఎప్పుడూ అతను తనదగ్గర ఎక్కువ పైకం వుంచుకోడు. నోట్లన్నీ పాంటు బెల్టులో కుట్టించుకొన్న సీక్రెట్ పాకెట్‌లో దాస్తాడు. చిల్లర పైసలుతప్ప పాంటు జేబులో నోట్లు వుండవు. ఓ అందమైన పర్సు మాత్రం పాంటు జేబులో ఎప్పుడూ వుంటుంది. అందులో అడ్రెస్ కార్డులూ, అవసరమైన కాగితాలు మాత్రమే వుంటయ్.

అతడు వూళ్ళోని వింతలూ విశేషాలూ చూడ్డానికి బయలుదేరిన మొదటిరోజే యీ సంఘటన జరిగింది.

యీ సంఘటనతో అతని ప్రోగ్రాం పూర్తిగా మారి పోయింది.

ఊళ్ళోని విశేషాలు చూడ్డం కట్టిపెట్టి, ఆమె యెక్కడైనా కనిపిస్తుందేమోనని గాలించసాగాడు. రెండు మూడుసార్లు ఆమె వుంటోన్న కాంపౌండు పరిసరాల్లో కూడా కాలుగాలిన పిల్లిలా తెగ తిరిగాడు. కాని ప్రయోజనం కనిపించలేదు.

అలా రెండు రోజులు అతి నీరసంగా దొర్లిపోయి నాయ్.

మూడవరోజు రాత్రి ఎనిమిదింటికే లాడ్జికి చేరుకొన్నాడు మూర్తి. తాళం తీసి గది తలుపులు తెరుస్తుండగా ఏవో ఎత్తుమడమల జోళ్ళ చప్పుడు వినిపించింది. వెనక్కి తిరిగిచూశాడు.

ఎవరో స్త్రీ తనకేసే పరుగెత్తుతోంది. గదుల్లోని వ్యక్తులెవరూ ఇంకా లాడ్జికి చేరుకోకపోవడంవల్ల వరండాలో ఎవరూ నడమాడ్డంలేదు. 'ఎవరీ స్త్రీ? ఎందుకిలా పరుగెత్తుతోంది?' అనుకొంటూండగా ఆమె అతడ్ని చేరుకొంది.

"ప్లీజ్! త్వరగా తలుపు తెరవండి....!" అంది కంగారుగా.

ఆమె భయంతో గజగజలాడుతోంది. చాలాదూరం పరుగెత్తడంవల్ల కాజోలు రొప్పుతోంది.

మూర్తి తలుపు తెరిచాడు. ఆమె గదిలోకి వెళ్ళిపోయింది. అతడు లోపలికి వెళ్ళి తలుపులు దగ్గరికి వేసి గదిలో దీపం వెలిగించాడు.

దీపం వెలుగులో ఆ స్త్రీ ఆకారాన్ని గమనించాడు. వెదుకుతున్న తీగ కాలికి తగిలినట్టయింది.

ఆమె ఎవరో కాదు. పచ్చరంగు పంజాబీ దుస్తుల పడతి. కాని ఇప్పుడామె ఆ వేషంలో లేదు. పింక్ కలర్ షిఫాన్ చీర కట్టింది. అదే రంగు జాకెట్టు తొడిగింది. ఆమె చెవుల్లోని జూకాలూ, చేతిలోని వ్యానిటీబాగూ, కాళ్ళకు తొడుక్కున్న హైహీల్సూ అన్నీ అదే రంగులో వున్నాయ్. దివినుండి భువికి దిగివచ్చిన అప్సరసలా వుంది!—

కాని ఆమె అందమైన కళ్ళల్లో భయాందోళనలు దోబూచులాడుతున్నాయ్. చంద్రబింబంలాంటి ముఖంలో స్వేదబిందువులు ముత్యాల్లాగా మెరుస్తున్నాయ్. ఆపాదమస్తకం గజగజలాడిపోతూ దీనంగా అతని కళ్ళల్లోకి చూసింది.

"ఎందుకలా కంగారు పడిపోతున్నారు? ముందు కూచోండి!" అంటూ పక్కనున్న కుర్చీ చూపాడు.

"మీరు ముందు తలుపులకి గడియపెట్టండి! అతడు నా కోసం వెదుక్కుంటూ యిటు రావచ్చు!" అంది ఆమె పక్కనున్న కుర్చీలో కూలబడుతూ.

అతడు తలుపులకి గడియపెట్టి వెనక్కి తిరిగి తిన్నగా వచ్చి ఆమె కెదురుగా మంచంలో కూచుని "ఇప్పుడు చెప్పండి! యెవడు వాడు? మీ కోసం యెందుకు గాలిస్తున్నాడు?" అని ప్రశ్నించాడు.

"వాడి పేరు రాజయ్య. వాడ్నందరూ రౌడీ రాజిగాడంటారు. వాడు నామీద కన్నేశాడు. నన్నెలాగైనా లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. నే నింతక్రితం ఒక మిత్రురాలింటికెళ్ళి తిరిగి వస్తోంటే నా వెంట పడ్డాడు. నాకు భయమేసి యిలా పరుగెత్తుకొచ్చాను" అందా యువతి.

"మీ పేరు?"

"మోహిని!"

"మీ కెవరూ లేరా?"

"లేరు! నే నొంటరిదాన్ని! ఓ ప్రైవేట్ కంపెనీలో స్టెనోగా పని చేస్తున్నాను. నే నొంటరిదాన్నని వాడు నామీద యెగబడుతున్నాడు" అంది మోహిని.

"అయితే మీ రిక్కడే వుండండి! అవసరమైతే విశ్రాంతి తీసుకోండి! వాడు వెళ్ళిపొయ్యాడో, లేదో చూచి వస్తాను" అంటూ మూర్తి, ఆమె జవాబుకోసం ఎదురుచూడకుండా గదిలోంచి బైటపడి, తలుపు మూసి, తాళం పెట్టి ముందుకి నడిచాడు.

రాజయ్య గుమ్మంలో నిల్చుని మేనేజర్‌తో కాబోలు మాట్లాడుతున్నాడు.

మూర్తి జేబులోంచి సిగరెట్టు పాకెట్టూ అగ్గిపెట్టే బైటికి తీసి, సిగరెట్టు వెలిగించుకొని దమ్ము లాగుతూ అక్కడే నిల్చుని ఆలోస్తున్నాడు.

రాజయ్య వెళ్ళిపొయ్యాడు. అతని వాలకం చూస్తే మోహినిని తరుముకొచ్చిన వ్యక్తిలా కనిపించలేదు. బహుశా, మోహినీ రాజయ్యా కలిసి యేదో నాటక మాడుతున్నారు కాబోలు అనుకొన్నాడు మూర్తి. తనలో తాను నవ్వుకొంటూ సిగరెట్టుపీకను క్రిందపడేసి, బూటు కాలితో నలిపి, ఆక్కడ్నించి వెనక్కి తిరిగాడు.

తలుపులు తెరుచుకొని గదిలోకి చేరుకొన్నాడు. మోహినికేసి చూసి ఆశ్చర్యపొయ్యాడు. ఇప్పుడామె వొంటిమీద చీరా, జాకెట్టూ లేదు. వాటి స్థానే స్లాకూ, బెల్ బాటమ్ వున్నయ్.

'వొంకీకి తగిలించిన నా బట్టల్ని ఎంత స్వతంత్రంగా ధరించింది!' అనుకొన్నాడు.

"ఈ వేషంలో నన్నతడు గుర్తుపట్టకపోవచ్చు! నేను వెళతాను! రేపు మీ బట్టలు మీకు పంపుతాను" అంది వానిటీబాగ్ ని చేతిలోకి తీసుకొంటూ.

మూర్తి చిన్నగా నవ్వాడు, "రౌడీ రాజిగాడు గుమ్మంలోనే కాపలా కాస్తున్నాడు. మీరు ఏ వేషంలో వెళ్ళినా అతడు పసికట్టెయ్యగలడు!" అన్నాడు.

"చచ్చాం పో! అయితే నేను నా రూం చేరుకోవడం యెలా....?" అంటూ మంచం మీద కూలబడిపోయింది మోహిని.

మూర్తి ఆమె కెదురుగా కుర్చీలో కూర్చుని, ఆమె కళ్ళలోకి చూస్తూ "రాజయ్య రౌడీ అంటున్నారు! మీ రా రౌడీగాడ్ని యెంతకాలం యిలా తప్పించుకు తిరగ్గలరు?" అని ప్రశ్నించాడు.

"తప్పించుకు తిరక్క ఏం చెయ్యను?"

"పెళ్ళాడాలి."

"ఎవర్ని? ఆ గూండాగాంగునా?"

"కాదు. మీకు నచ్చిన మరో వ్యక్తిని."

మోహిని చిన్నగా నవ్వింది. "నాకు నచ్చిన వ్యక్తి నా వెంటపడొద్దూ?" అంది.

"మీరే అతని వెంటపడొచ్చుగా?"

"ఆడది వెంటపడితే అలుసైపోనూ?"

"ఒకర్నొకరు అర్థం చేసుకొన్న తరువాత అలుసైతే మాత్రమేం?" అన్నాడు మూర్తి.

మోహిని వెంటనే జవాబు చెప్పలేదు. తల క్రిందికి వొంచి, పెధవి అదోలా విరిచి, "సం హౌ, ఐడోన్ట్

లైక్ మారేజస్!" అంటూ కనుగుడ్లు గుండ్రంగా తిప్పి, అతని కళ్ళల్లోకి గుచ్చి చూచి, చిన్నగా నవ్వింది.

"అవును, స్వేచ్ఛ వుండదు" మూర్తి కూడా నవ్వాడు.

"మీ కయిందా పెళ్ళి?"

లేదన్నట్టు తలూపాడు మూర్తి.

"ఎందుకని?"

"జవాబు మీ రింత క్రితమే చెప్పారు" అన్నాడు మూర్తి.

"ఓ, యువార్ క్లవర్!" అంది కళ్ళు గుండ్రంగా తిప్పుతూ.

"మీకంటేనా?"

మోహిని మాట్లాడలేదు. తనలో తాను నవ్వుకుంది. మెల్లగా ఆవులించి గట్టిగా వొళ్ళు విరుచుకొంది. రిస్టు వాచీ చూచుకొని "ఓ మైగాడ్! అప్పుడే పదైంది!" తనలో తాను గొణుక్కుంది.

"ఇంతకీ యిప్పుడు నన్నేం చెయ్యమంటారు?"

"ఏం చేసినా నా కభ్యంతరంలేదు."

"అవును. మీ కెందుకుంటుంది అభ్యంతరం! అభ్యంతరాలన్నీ ఆడవాళ్ళకేగా?" చిలిపిగా నవ్వింది.

"ఇక్కడేమో వున్నది ఒక్కటే మంచం! నాకేమో క్రింద పడుకొంటే నిద్రరాదు. మరి మీకో?"

"నాకూ అంతే!" అన్నాడు మూర్తి.

"మరి యెట్లా....?" చిలిపిగా మూర్తి కళ్ళల్లోకి చూచింది.

"ఉన్న వొక్క మంచాన్నీ చెరో సగం పంచుకోవాలి! అంతకంటే గత్యంతరం లేదు" అన్నాడు మూర్తి

భావగర్భితంగా.

"షరతులేవైనా వున్నాయా?"

"ఎందుకు లేవు?—వున్నయ్."

"ఏమిటవి?" ప్రశ్నించింది మోహిని.

"నిద్రలో మీరు నామీద చెయ్యో కాలో వేశారను కోండి, నా కాస్టే అభ్యంతరం వుండదు! మీకూ అలాగే వుండకూడదు!" అన్నాడు మూర్తి చిన్నగా నవ్వుతూ.

మోహిని ఆమోదించినట్టు తల వొంచి, అతని కేసి క్రీగంట చూసి, "నాది మరో షరతు" అంది.

"ఏమిటో అది?" క్వొశ్చెన్ మార్కు ముఖం పెట్టాడు మూర్తి.

"గదిలో దీపముంటే నాకు నిద్రపట్టదు. అందుచేత దీపం ఆర్పేయాలి."

"వొప్పుకొన్నాం" అన్నాడు మూర్తి.

మోహిని బట్టలు మార్చుకోవడానికి బాత్ రూంలోకి వెళ్ళింది. మూర్తి మంచంమీద బట్టలు గులిపి సర్దసాగాడు. అతడుకూడా బట్టలు మార్చుకొన్న తరువాత యిద్దరూ మంచానికి చెరోవైవు చేరారు. మంచంమీద హద్దులు యేర్పరచుకొని, గదిలో దీపం ఆర్పేసి, చెరోవైపు పడుకొన్నారు.

మోహిని శరీరంలోంచి వెదజల్లే సుగంధం అతగాడ్ని మత్తెక్కిస్తోంది. ఆమె కురుల్లోంచి వెలువడే లవెండర్ వాసన అతని ముక్కుపుటాల్ని సోకుతోంది. అతని శరీరం లోని ప్రతి అణువూ వేడెక్కి, కుతకుతలాడి పోతోంది. ఆకలిగొన్నవాడి ముందు మృష్టాన్నం వడ్డించి, చేతులు కట్టేసినట్టుంది అతని సితి.

గదిలో చీకటి!—చీకటికి మించిన నిశ్శబ్దం!—

మూర్తి భరించలేక పొయ్యాడు. మెల్లగా పక్కకి తిరిగి, కుడిచేతిని ముందుకి చాచి ఆమె నడుంమీద వేశాడు. ఆమెలో చలనంలేదు. ఉచ్వాస నిశ్వాసలకు ఆమె రొమ్ములు అలల్లా పైకెగురుతున్నయ్. అతని గుండెల్ని తోడేస్తున్నయ్. మరింత ధైర్యంచేసి, కుడి చేతి పట్టుబిగించి ఆమెను దగ్గరికి లాక్కొన్నాడు. ఆమె మెల్లగా కదిలింది. పక్కకి తిరిగి మరింత దగ్గరికి జరిగి, అతని చెవిదగ్గర తన పెదాల్ని చేర్చి, "ఏమండోయ్! మీరు హద్దులు దాటుతున్నారు" అంది రహస్యంగా నవ్వుతూ.

"చీకట్లో హద్దులేమిటి?మన షరతులన్నీ వెలుతుర్లోనే" అన్నాడు మూర్తి ఆమెను మరింత దగ్గరికి లాక్కుంటూ.

"అలాగా? ఆ సంగతి ముందుగా తెలిసివుంటే ఇంత కాలం వృధా అయివుండేదే కాదు" అంటూ మోహిని తన బాడీలోంచి కర్చీఫ్ తీసి అతని ముఖానికి అదిమి పెట్టింది. రెండే రెండు క్షణాలు! స్పృహ కోల్పోయి నిర్జీవంగా పక్కకి వొరిగిపొయ్యాడు.

అతనికి వొళ్ళు తెలిసి కళ్ళు తెరిచేసరికి గదిలో దీపం వెలుగుతోంది. పక్కమీద మోహిని మాయమైంది. జరిగిన మోసం అర్థం చేసుకున్నాడు. మోహినితోబాటు గదిలోంచి ఏమైనా మాయమైందోనని గదంతా చెక్ చేశాడు.

అతని సూట్ కేసు తెరిచివుంది. బట్టలన్నీ చిందర వందరగా విరజిమ్మబడి వున్నయ్. కాని ఏమీ మాయం కాలేదు.

బహుశ పైకంకోసం కాబోలు గదంతా గాలించబడి వుంది. కాని అది వుంటేగా ఆమె చేజిక్కడానికి?

మూర్తి చిన్నగా నవ్వుకున్నాడు.

మూర్తి తనతోపాటు తెచ్చుకున్న వెయ్యి రూపా యలూ హోటల్ మేనేజర్ చేతికిచ్చి దాచాడు. రోజూ తనకి కావలసినంత మాత్రమే అతనివద్దనుండి పుచ్చుకునే వాడు. ఇరవైయ్యో ముప్పయ్యో తనవద్ద మిగిలిందికూడా పాంటు బెల్టులోని సీక్రెట్ పాకెట్‌లో వుంటుంది. చిల్లర పైసలు మాత్రమే వుంటయ్ తన పాంటు జేబులో. పాపం మోహిని యింత శ్రమపడి ఆడిన నాటకమంతా వృథా అయింది.

మూర్తి తాను రాత్రి విడిచిన పాంటుని వంకీనుండి అందుకొని సీక్రెట్ పాకెట్‌లో గాలించాడు. తాను దాచిన పైసలు అలాగే వున్నయ్. వాటితోబాటు యెర్ర రాయి పొదిగిన వుంగరం కూడా బైటపడింది.

పాపం! మోహిని యీ వుంగరంకోసమే గాలించింది కాబోలు-అనుకున్నాడు.

3

సాయంత్రం నాలుగైంది.

మూర్తి తన గదిలో కూచుని సిగరెట్టు కాల్చుకుంటు న్నాడు. అతని మనసేమీ బాగోలేదు. ఎక్కడికి వెళ్ళ డానికి మనస్కరించడం లేదు. రాత్రి జరిగిన సంఘటనే మాటి మాటికీ గుర్తొస్తోంది.

మోహిని యెంత అందంగా వుంటుందో, అంత తెలి వైంది. ఎంత తెలివిగా నాటకమాడింది!-యెంత క్లవర్‌గా తప్పించుకుపోయింది!-

నోటిదాకా వొచ్చిన భోజనం ఏ కాకో గ్రద్దో తన్నుకుపోయినట్టు, చిక్కినట్టే చిక్కి తెలివిగా తప్పిం చుకుపోయింది!-

ఆమె స్నేహాన్ని సంపాయించడం యెలా? ఆమెను ప్రసన్నం చేసుకునే మార్గమేమిటి? ఆమెను పొందే మార్గమే లేదా?-

మూర్తి దీర్ఘంగా ఆలోచిస్తూండిపొయ్యాడు.

అతని బుర్రలో ఏదో ఆలోచన తట్టింది. చేతనున్న సిగరెట్టుని ఆష్ట్రేలో నొక్కి హుషారుగా కుర్చీలోంచి లేచాడు. చకచకా బట్టలు మార్చుకుని గదిలోంచి బైట పడ్డాడు.

ఆటో చేసుకుని కోటీకి బైలుదేరాడు. కోటీలో ఆమె వుంటోన్న కాంపౌండు ముందు ఆటో దిగి డ్రైవర్ కి అద్దె చెల్లించి, కాంపౌడు గేటు కేసి బయలుదేరాడు. గేట్లు బార్లా తెరిచివున్నయ్.

కాపలా వాడు ఆ పరిసరాల్లో యెక్కడా కనిపించ లేదు. ఆ రోజు తాను చూచిన వ్యక్తి నైట్ వాచర్ కాబోలు, అనుకున్నాడు మూర్తి.

గేటు దాటుకుని, మెట్లెక్కి మేడమీదికి చేరుకున్నాడు. మేడమీద వరుసగా ఆరు గదులున్నయ్. ఎదురు వరుసలో మరో ఆరు గదులు. కొన్ని గదులికి తలుపులు మూసి లోపల గడియ పెట్టబడి వున్నయ్. కొన్ని గదుల తలుపులు తెరిచివున్నయ్. మరికొన్ని గదుల తలుపులికి తాళం కప్పలు వ్రేలాడుతున్నయ్.

ప్రతి గది గుమ్మంపైనా గోడకి నేమ్ బోర్డు తగిలించి వుంది. మూర్తి ఒక్కో నేమ్ బోర్డూ చూచుకొంటూ ముందుకి నడుస్తున్నాడు. అతని కాళ్ళు 8 వ నంబర్ గదిముందు ఆగిపోయినయ్.

ఆ గది గుమ్మం పైన గోడకి "మిస్ మోహిని" అన్న నేమ్‌బోర్డు తగిలించి వుంది. కాని తలుపులు మూసి

వున్నయ్. మూసిన తలుపులికి తాళం కప్ప వేలాడు తోంది.

మూర్తి బరువుగా నిట్టూర్చాడు.

మోహినిలాంటి వ్యక్తులు రాత్రిళ్ళుమాత్రమే 'బిజీ'గా వుంటారు. పగలంతా తమ గదుల్లో విశ్రాంతి తీసు కొంటారు. ఈ వేళప్పుడు మోహిని తప్పకుండా తన గదిలో దొరుకుతుందన్న ఆశతో బయలుదేరాడు మూర్తి. కాని అతని ఆశ ఫలించలేదు.

మూర్తి తలొంచుకుని దీర్ఘంగా ఆలోచిస్తూ మేడ మెట్లు దిగి క్రిందికి చేరుకున్నాడు. కాంపౌండులోంచి బైటపడి యెదురుగా కనిపిస్తోన్న ఇరానీ హోటల్ కేసి దారి తీశాడు.

తిన్నగా కొంత దూరం నడిచి ఓ పాన్ షాపు దగ్గర ఆగి సిగరెట్ పాకెట్ కొని, సిగరెట్ కాలుస్తూ అక్కడే వున్న బెంచిమీద కూలబడ్డాడు.

"రెండు జరదాపాన్లు కట్టు బాయ్" అంటూ అక్క డికి చేరుకున్నారిద్దరు కుర్రాళ్ళు.

పాన్‌షాపు వాడు ఆకులు కత్తిరించి పాన్‌లు కట్ట డంలో మునిగిపోయ్యాడు. కుర్రాళ్ళిద్దరూ మాటల్లో పడ్డారు.

"రాజయ్యామధ్య మంజులా బాంకు మేనేజర్‌తో తిరుగుతున్నాడు. ఏమిటో విశేషం?" ఓ కుర్రాడు తన సందేహాన్ని బైట పెట్టాడు.

"విశేషం లేకుండా రాజయ్య ఏ పనీ చెయ్యడు. ఏదో ప్లాను కాబోలు" అన్నాడు రెండవవాడు.

"ఆ మేనేజర్ మోహినిమీద కన్నేశాడేమో!" అన్నాడు మొదటివాడు.

"అది అంత తేలిగ్గా పడేరకం కాదు. పెద్ద చెయ్యి" అన్నాడు రెండవవాడు.

"మనకెందుకులే భయ్! పెద్దవాళ్ళ వ్యవహారం!" అన్నాడు మొదటివాడు. వెంటనే ముందుకి వొంగి "మోహినికి మినిస్టర్‌తో కూడా పరిచయముందటగా?" అన్నాడు రహస్యంగా.

"అవునట!" రెండవవాడు తలూపాడు!

పాన్‌షాప్‌వాలా పాన్‌లు కట్టడం పూర్తవడంతో పాన్‌లు పట్టుకొని పైసలు చెల్లించి వెళ్ళిపోయ్యారు కుర్రాళ్ళిద్దరూ.

మూర్తి ఆలోచనల్లో పడ్డాడు.

మోహిని పెద్ద చెయ్యి గనుకనే అంత ఘరానాగా వ్యవహరిస్తోంది! అలాంటి వ్యక్తులతో క్లోజ్‌గా మూవ్ కాకూడదు. తాను చేసిన నేరాలన్నీ పక్కవాడిమీదికి నెట్టి జాగ్రత్తగా తప్పుకొంటూరు!—అనుకొన్నాడు.

కాని అతని మనసెందుకో ఆమెను గురించి ఆలోచించకుండా వుండలేకపోతోంది.

ఎంత అందంగా వుంటుంది!—ఒక్క రాత్రి ఆమెతో గడిపితే చాలు! ఆ మధురక్షణాలని నెమరువేసుకొంటూ జీవితాంతం గడిపేయవచ్చు! అలాంటి అందగత్తెను అనుభవించని జీవితం బ్రతికెందుకు?—వొకే వొక్క రాత్రి!—వొక్క రాత్రి చాలు!—

మూర్తి బెంచీమీంచి లేచి నిలుచున్నాడు. రిస్టువాచీ చూచుకొన్నాడు. ఏడు దాటింది. పేవ్‌మెంట్ మీద జనం రద్దీగా తిరుగుతున్నారు. తారురోడ్డు వాహనాల రాకపోకలతో చాలా బిజీగా తయారైంది.

మూర్తి అక్కడ్నించి మోహిని వుంటోన్న

కాంపౌండు కేసి బయలుదేరాడు. అకస్మాత్తుగా అతని కళ్ళు విప్పారినయ్.

మోహిని నీలంరంగు పంజాబీ డ్రెస్సులో వానిటీబాగ్ వూపుకొంటూ, అతని ముందు వందగజాల దూరంలో, తన కాంపౌండు కేసి నడుస్తోంది.

అంతక్రితం మూర్తి గుండెల్లో పేరుకొన్న నీరసం వొక్కసారిగా ఆవిరైపోయింది. ఉత్సాహం పెల్లుబికింది.

ముందు నడుస్తోన్న మోహిని తన కాంపౌండుని సమీపిస్తోంది. మూర్తి మెల్లగా పరుగు లంకించుకొన్నాడు. తిన్నగా వెళ్ళి ఆమెకు 'డాష్' కొట్టాడు.

మోహిని బేలన్స్ తప్పి బోరగిల పడబోయింది. వెంటనే మూర్తి ఆమెను క్రింద పడకుండా పట్టుకొన్నాడు.

"అయాంసారీ మాడమ్! తొందర్లో చూడలేదు! ప్లీజ్ యెక్స్‌క్యూజ్ మీ....!" అంటూ ఆమె ముఖంలోకి చూశాడు. "ఓహ్! మీరా....?" అంటూ ఆశ్చర్యంగా ఆగిపొయ్యాడు.

మోహిని అతని కేసి ఆపాదమస్తం పరిశీలనగా చూసింది. అతని తల చెదిరివుంది. ఉఛ్వాస నిశ్వాసలతో అతని ఛాతీ యెగిరెగిరి పడుతోంది. అతని కళ్ళల్లో కంగారు, ముఖంలో భయభ్రాంతులు!—

ఆమె అతని భుజంమీద చెయ్యివేసి "ఏమిటి? ఎందుకలా కంగారు పడుతున్నారు? యేమిటా తొందర?" అని ప్రశ్నించింది.

"అతడు—రౌడీ రాజయ్య—నా వెంటపడ్డాడు! అతని చేతిలో కత్తి కూడా వుంది!—ప్లీజ్! నన్నెక్క

డైనా దాచండి! వాడు నన్ను చంపేస్తాడు!" అని తొందరపడసాగాడు.

పరుగెత్తడం వల్ల అలుపుతో మాటలు తిన్నగా రావడంలేదు.

మోహిని ఒక్కక్షణం ఆగింది. చిన్నగా నవ్వింది. "మరేం ఫరవాలేదు. ఇక్కడే నా గది. మీరు నా గదిలో తల దాచుకోవచ్చు! రండి!" అంది అతని చెయ్యి పట్టుకొని.

"ఏమిటి? మీ గదిలోనా....? అమ్మ బాబోయ్! యింకేమైనా వుందా? వాడు తిన్నగా గది వద్దకి వచ్చి గోల చేస్తాడేమో! వొద్దు! వొద్దు!" అన్నాడు భయం భయంగా.

"డోన్ట్ వర్రీ మిస్టర్ మూర్తీ! వాడు కాంపౌండు లోకి రాడు! నైట్ వాచర్ తాతయ్యను మీరు చూడలేదు. అతడీ పరిసరాల్లో వొకప్పుడు పేరు మోసిన రౌడీ. తాతయ్యంటే రాజయ్యకి సింహ స్వప్నం!" అంది మోహిని.

ఇద్దరూ కాంపౌండు గేటు దగ్గరికి చేరుకొన్నారు.

"అబ్బాయి ఎవరు బేబీ? బాయ్‌ఫ్రెండా? ఇంత క్రితం ఎప్పుడూ చూళ్ళేదే!" అంటూ తలుపు తెరిచాడు నైట్‌వాచర్ తాతయ్య.

"బాయ్‌ఫ్రెండేమిటి ఖర్మ! నా మేనత్త కొడుకు. వూళ్ళోంచి యీ రోజే వచ్చాట్ట! నా కోసం వెదుక్కొంటూ వస్తోంటే నేనే కనిపించాను. చిన్నప్పుడు మేమిద్దరం కలిసి తిరిగేవాళ్ళం. మాకు వూహ తెలియని వయసులోనే ఆయనకి పెళ్ళి చేశారుగనుక సరిపోయింది.

లేకపోతే ఆయన కిష్టం లేకపోయినా బలవంతంగా లేపు కెళ్ళి తాళి కట్టించుకొని వుండేదాన్ని....” అంది నవ్వుతూ.

“అల్లాగా?—మీ యిద్దరికీ ఈడూ జోడూ సరి పొయ్యేది—చిలకా గోరంకల్లా వుండేవారు” అన్నాడు తాతయ్య తెగ ముచ్చటపడిపోతూ.

మూర్తి మోహినీ చెట్టాపట్టా లేసుకొని నవ్వుకొంటూ మేడమెట్లకేసి నడిచారు.

మోహిని గది తాళం తెరుస్తూ “ఇంతకీ మీ రిక్కడి కెలా వచ్చారు?” అని ప్రశ్నించింది.

“ఓ మిత్రుడ్ని కలుసుకొనేందుకు వచ్చాను. తీరా వెళ్ళితే అతడు గదిలో లేడు. వెనక్కి తిరిగి వస్తూండగా రాజయ్య తారసపడ్డాడు, నన్నెలా గుర్తుపట్టాడో తెలీదు. నా వెంటపడ్డాడు. మీకు ఆ రాత్రి షెల్టరివ్వడం వచ్చింది వండి!”

మోహిని చిన్నగా నవ్వింది.

“మీరు మగాళ్ళు!—ఈ మాత్రానికే బెంగపడిపోతే ఎలా?” అంది.

“బెంగపడడం కాదు. దారినపోయే తగువుని తన మీదికి తెచ్చుకోవడం. రంగంలోకి దిగదల్చుకొంటే రౌడీల క్కాదు వాడ్ని పుట్టించిన జేజయ్యల క్కూడా జవాబు చెప్పగలం!” అన్నాడు పౌరుషంగా.

ఇద్దరూ గదిలోకి చేరుకొన్నారు. మోహిని స్విచ్ నొక్కి గదిలో దీపం వెలిగించింది. మూర్తి మంచంమీద వాలిపొయ్యాడు.

“మీరు బాగా అలిసిపోయినట్టున్నారు. బాత్

రూములో కెళ్ళి ముఖం కడుక్కొని రండి! సోపూ టవలూ లోపలే వున్నాయ్. బాయ్ చేత కాఫీ తెప్పిస్తాను" అంది మోహిని చేత నున్న వానిటీ బాగ్ ని టీపాయ్ మీద పెడుతూ.

"అవును. చాలా చిరాగ్గా వుంది. వెళ్ళి ముఖం కడుక్కొని వస్తాను" అంటూ మంచంమీంచి లేచి బాత్ రూములోకి నడిచాడు మూర్తి.

అతడు ముఖమూ కాళ్ళూ కడుక్కొని, తల దువ్వుకుని, ఫ్రెష్ గా తయారై గదిలోకి చేరుకొనేసరికి మోహిని రెండు కప్పుల్లో కాఫీ పోసి తయారుగా వుంచింది.

మూర్తి తిన్నగా వచ్చి టీపాయ్ కెదురుగా కుర్చీలో కూచున్నాడు. మోహిని అతని కెదురుగా మరో కుర్చీలో కూచుని వో కాఫీకప్పుని అతనికి అందించింది.

"థాంక్ యూ!" అంటూ కాఫీ కప్పు నందుకొని సిప్ చేసి కప్పుని టీపాయ్ మీద పెట్టాడు.

మోహిని కూడా కప్పులోని కాఫీని సిప్ చేస్తూ కూచుంది. మూర్తి పాంటు జేబులోంచి సిగరెట్టు పాకెట్ ని పైకితీసి, "ఐ వాంటు స్మోక్ విత్ యువర్ పర్మిషన్" అన్నాడు.

"నో అబ్జక్షన్!" అంది మోహిని.

మూర్తి మరోసారి జేబులు తడుముకుని "మాచెస్ ఎక్కడో మరిచిపోయ్యాను" అన్నాడు.

"ఐ విల్ గెట్ యూ! జెస్ట్ యె సెకండ్!" అంటూ మోహిని టీపాయ్ ముందునుంచి లేచి పక్కకి తిరిగింది.

తక్షణం, కప్పుల స్థానాల్ని మార్చేశాడు మూర్తి.

మోహిని టేబుల్ మీద నున్న అగ్గిపెట్టె నందుకుని మూర్తికి అందించింది.

మూర్తి అగ్గిపుల్లతో సిగరెట్టు వెలిగించుకుని, దమ్ము గట్టిగా లాగి గాల్లోకి వొదలి కప్పుని చేతిలోకి తీసుకున్నాడు.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కాఫీ సిప్ చెయ్యసాగారు.

"ఆ రాత్రి గదిలోంచి చెప్పకుండా వచ్చేశారేం?" అని ప్రశ్నించాడు మూర్తి.

"మీరు వొళ్ళు మరిచి నిద్రపోతున్నారు—మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యడం యిష్టంలేక చెప్పకుండానే బయలు దేరాను" అంది మోహిని.

"అవును! ఆ రాత్రి అంత నిద్ర యెలా వొచ్చిందో అర్థంకావడంలేదు" అన్నాడు మూర్తి అసలు విషయాన్ని బైటికి లాగాలన్న ఉద్దేశంతో.

"నిజమే! నాకూ అలాగే ముంచుకొచ్చింది! బహుశా బాగా అలిసిపోయి వున్నామేమో!" అంది అసలు విషయాన్ని దాచేసూ మోహిని.

మూర్తి తనలో తాను నవ్వుకున్నాడు.

కాఫీ త్రాగడం పూర్తయింది.

"మిస్టర్ మూర్తీ!—మిమ్మల్నింత క్రితం ఎక్కడో చూచినట్టుంది!" అంది మోహిని.

"అదేమిటి? నిన్న నా గదిలోనేగా మనం కలుసుకున్నది? అప్పుడే మరిచిపొయ్యారా?" అన్నాడు మూర్తి ఆశ్చర్యంగా.

"నిన్న—కాదు—అంత— క్రితం!" ఆమె మాటలు ముద్ద ముద్దగా వస్తున్నాయి.

"అంత క్రితమా?—అసంభవం!—అసలు నాదీ వూరు కాదు. ఉద్యోగంకోసం వచ్చా నీ వూరు. వచ్చి వారం రోజులు పూర్తికాలేదు. మీరు నన్ను చూడ్డమేమిటి? మనుషుల్ని పోలిన మనుషులుంటారు. ఎవర్నో నాలాంటి వ్యక్తిని చూచి వుండొచ్చు!" అన్నాడు మూర్తి.

ఆమె చిన్నగా నవ్వింది. ఆమె కళ్ళు తేలిపోతున్నాయి. నిద్ర ముంచుకొస్తోంది.

"నాకు—నిద్ర—ముంచు—కొస్తోంది — నన్ను— మంచం—మీదికి— చేర్చండి—ప్లీజ్!" బలవంతంగా కళ్ళు తెరిచి ప్రాధేయపడింది.

"అలాగే" అంటూ ఆమెను మెల్లగా కుర్చీలోంచి పైకి లేపాడు.

ఆమె నిల్చోలేక అతనిమీద వాలిపోయింది. మూర్తి ఆమెను అమాంతం చేతుల్లోకి తీసుకుని, మంచంమీద పడుకోబెట్టాడు.

"మీకు యెలా వుంది?" ఆమెమీదికి వొంగి ఆత్రంగా ప్రశ్నించాడు.

"నిన్న — రాత్రి — మీరు — ఎలా — ఫీల్ — అయ్యారో—అచ్చం—అలాగే—" మోహిని బలవంతంగా పెదాలమీదికి నవ్వు తెచ్చుకుంది. అతి ప్రయత్నం మీద కనురెప్పలు తెరిచి "మిస్టర్ మూర్తీ!—యూ ఆర్ —టూ క్లవర్ర్!" అంది.

"మీ కంఠేనా?" మూర్తి తనలో తాను నవ్వుకున్నాడు.

"ఐ—లైక్—యూ!" అంటూ రెండు చేతులూ ముందుకి చాచింది.

"ఐ లవ్ యూ మోహినీ!" అంటూ మూర్తి ఆమె

మీదికి వొంగి ఆమె పెదాలని తన పెదాలతో కప్పాడు. ఆమె కళ్ళు మూతలుబడ్డయ్.

మరుక్షణం మోహిని నిద్రలోకి జారిపోయింది. చలనం లేకుండా నిర్జీవంగా, దాదాపు శవంలాగా తయారైంది. ఉఛ్వాస నిశ్వాసలతో ఆమె గుండెలు పైకీ కిందికీ అదురుతున్నాయి.

తెలివి తప్పిన వ్యక్తి శవంతో సమానం. తెలివి తప్పిన వ్యక్తితో కోర్కెలు తీర్చుకోవడమంత నీచాను నీచం మరొకటిలేదు. అందుచేత మూర్తి ఆమెను ముట్టుకోదలచలేదు. ఆమెమీద రగ్గు కప్పి, అక్కడ్నించి వెళ్ళిపోదామనుకున్నాడు.

కాని యింతదూరం తానెందు కొచ్చినట్టు?—తాను సాధించేదేమిటి? నిజంగా తాను దురదృష్టవంతుడు. తనకామెను పొందే యోగం లేదు. అందుకనే యిలాంటి అవాంతరాలు ఎదురవుతున్నాయి.

తాను మోహినిని పూర్తిగా మరిచిపోవాలి! తనకీ ఆమెకూ అంతరాంతరాలలో, కలుసుకోవాలన్న కాంక్ష తీవ్రంగా వున్నా, యేదో అతీతశక్తి అడ్డు పడుతోంది అనుకున్నాడు మూర్తి.

తాను పూర్తిగా మరిచిపోదలుచుకున్న వ్యక్తి తాలూకు వస్తువులు మాత్రం తన దగ్గర ఎందుకుండాలి? అని ప్రశ్నించుకున్నాడు.

వెంటనే పాంటు సీక్రెట్ పోకెట్‌లోంచి ఎర్ర రాయి పొదిగిన ఉంగరాన్ని బైటికి తీసి, ఆమె కుడిచేతి ఉంగరపు వేలికి తొడిగాడు.

"గుడ్ బై మై డియర్! వొస్తా!" అని చెప్పి గది

లోంచి బైటికి నడిచాడు. గది తలుపులు దగ్గరికివేసి చక చకా ముందుకి నడిచాడు.

4

రాత్రి పదయింది.

మూర్తి గదిలోని దీపం ఆర్పి జీరోవాట్స్ బల్బు వెలిగించి మంచంమీదికి చేరుకున్నాడు. గది మధ్య సీలింగ్ ఫాన్ తిరుగుతోంది.

ఎంత ప్రయత్నించినా అతనికి నిద్ర పట్టడం లేదు. అతని మనో నేత్రాలముందు మోహిని భువనమోహన సుందర విగ్రహం చెదిరిపోవడంలేదు. గదిలో నిశ్శబ్దం తాండవిస్తోంది.

ఉన్నట్టుండి గదిలో బజ్ మోగసాగింది. మూర్తి మంచంమీంచి క్రిందికి దిగి తిన్నగా తలుపుల దగ్గరికి చేరుకుని గడియతీసి తలుపు తెరిచాడు.

గుమ్మంవద్ద నిల్చునివున్న స్త్రీమూర్తి యెవరో కాదు. మోహిని! జగన్మోహినిలా తయారైంది. ఆమె అందాన్ని చూచి ముగ్ధుడైపోయ్యాడు మూర్తి. కళ్ళప్పగించి అలా చూస్తూ నిల్చుండిపొయ్యాడు.

మోహిని గదిలోపలికి చేరుకొని తలుపులు మూసి గడియపెట్టి వెనక్కి తిరిగింది. మూర్తి దగ్గరగా జరిగి అతని భుజంమీద తన రెండు చేతులూ వేసి, అతని కళ్ళలోకి చూస్తూ అడిగింది.

"మిస్టర్ మూర్తీ! నిన్న మీరు నా గదిలోంచి వెళ్ళిపోతూ ఏమన్నారో గుర్తుందా?" అని.

"ఏమో!-నాకు గుర్తు లేదు!-ఏమన్నాను?"

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను- అని."

"అవును!- ఇప్పటికీ ఆ మాటే అంటాను."

"నువ్వు కాబోతున్న ఆఫీసరువి! సంఘంలో గౌరవంగా బ్రతకాలనుకుంటున్నవాడివి! నాలాంటి స్త్రీని ప్రేమించి యెంతకాలం గౌరవంగా బ్రతగ్గలవ్?"

"నువ్వేమంటున్నావో నా కర్థంకావడం లేదు."

"మరింత వివరంగా చెప్పాలా?"

అవునన్నట్టు తలూపాడు మూర్తి.

"నువ్వు ఆకాశవీధిలో విహరించే మేఘానివి - నేను నూతిలో బ్రతికే కప్పని-యీ రెండూ యెన్నడయినా కలుసుకోగలవా?"

"మేఘం బరువెక్కి వర్షించినపుడు యీ రెండో కలుసుకొంటూనే వున్నాయిగదా!"

"కలుసుకోవచ్చు-కాని కలిసి బ్రతకలేవు."

"కలుసుకుంటే చాలు- కలిసి బ్రతకనక్కరలేదు,"

"కలుసుకుందామనే వచ్చాను."

"అది నా అదృష్టం!"

"కాదు-నా అదృష్టం కూడా."

"ఐతే యిక నేం ఐక్యమైపోదాం!" అంటూ మూర్తి ఆమెను తన కౌగిట్లో బంధించాడు.

ఆ రాత్రి-ఆ గది-ప్రేయసీప్రియుల ప్రణయ సంభాషణలతో, కవ్వింపులతో, కౌగిలంతలతో; నిట్టూర్పులతో వగైరా వగైరా కామకలాపాలతో పునీతమైపోయింది.

మోహిని అందగత్తే కాదు తను సుఖిస్తూ మగవాణ్ని సుఖపెట్టడంలో జాణ కూడా. మూర్తి ఆమెకు సమవుజ్జీకావడంవల్ల ఆ ప్రేమికులు ఆ రాత్రి ఆనందపుటంచుల్ని చవి చూశారు. అలిసి, సొలిసి, ఒకరిపైనొకరు సొక్కి సోలి నిద్రాదేవి వొడిలోకి జారిపొయ్యారు.

హోటల్ బాయ్ డోర్‌బజ్ నొక్కేదాకా ఆ

యిద్దర్లో యెవరికీ మెలుకువ రాలేదు.

స్నానపానాదులు ముగించుకొని ఒకరికొకరువీడ్కోలు చెప్పుకునేప్పుడు మోహిని మూర్తి దగ్గర సెలవు తీసుకుంటూ అన్నది. "మక్కువ తీరేందుకు కనీసం ముచ్చటగా మూడు రాత్రులైనా గడపాలట" అంది చిలిపిగా నవ్వుతూ.

"అయితే ఇహనేం?-రాత్రికి అన్ని యేర్పాట్లూ చేయించమన్నావా?" అన్నాడు మూర్తి నవ్వుతూ.

"స్థలం మార్పు కొత్త అందాలని సృష్టిస్తుంది. ఈ రాత్రికి నా గదిలో—డిన్నర్ కూడా అరేంజ్ చేస్తాను. అభ్యంతరమా?" అంది మోహిని.

"చేతి రుమాళ్ళూ—కాఫీ కప్పులూ—మత్తుమందులికి దూరంగా వున్నంతకాలం-నాకే అభ్యంతరమూ లేదు" అన్నాడు మూర్తి తమాషాగా నవ్వుతూ.

మోహిని ముఖం చిన్నబోయింది. కుడిచేతి వుంగరపు వ్రేలిని చూపుతూ "ఈ వుంగరం విలువెంతో తెలుసా?" అని ప్రశ్నించింది.

"ఏమో నాకు తెలీదు, నేను రత్నపరీక్షకుడ్నికాను!" అన్నాడు మూర్తి.

"ఇరవై వేలు!"

"అమ్మబాబోయ్!" ఆశ్చర్యపోయ్యాడు మూర్తి.

"ఈ వుంగరకోసం మీ మీద మత్తుమందు ప్రయోగించవలసివచ్చింది. కాని నా ప్రయత్నం ఫలించలేదు. చివరికి మీరే నా వ్రేలికి తొడిగారు. ఇక అలా ప్రయోగాలు చెయ్యవలసిన అవసరం లేదు" అంది మోహిని.

మూర్తి "అలాగా?" అంటూ ఆశ్చర్యంగా తలూపాడు. "అయితే నా అభ్యంతరం ఏమీ లేదు. రాత్రికి

నీ ఆతిథ్యం పుచ్చుకోవడానికి సిద్ధంగానే వున్నాను. ఏడింటికల్లా వచ్చేయమన్నావా?" అని ప్రశ్నించాడు.

"నువ్వు రావొద్దు! సాయంత్రం ఓ స్నేహితురాలు నన్ను కలుసుకుంటానని ఫోన్ చేసింది. ఆమెను ఇంటికి సాగనంపి నేనే యిక్కడికి వస్తాను. మనిద్దరం కలిసే వెళ్ళొచ్చు!" అంది మోహిని.

"అలాగే" అన్నాడు మూర్తి.

మోహిని మూర్తికి 'టా టా' చెప్పి ముందుకి నడిచింది.

ఆమె వెళుతూ వెళుతూ విసిరిన చిరునవ్వు గుండెల్లో పదిలపరుచుకుని, మంచంమీద వాలిపొయ్యాడు మూర్తి కలలుగంటూ.

5

సాయంత్రం ఏడూనలభై అయింది.

కాంప్లౌండు ముందు ఆటో దిగి మోహిని, మూర్తి మేడమీదకి చేరుకున్నారు. గదిముందు ఆగి మోహిని తన వానిటీ బాగ్ తెరిచి పొడుగుపాటి తాళం చెవిని బైటికి తీసి, తాళం చెవిలో తలుపులు తెరిచి లోపలికి అడుగు పెట్టింది.

మూర్తి కూడా ఆమెతో బాటే గదిలోకి చేరుకున్నాడు.

మోహిని తలుపులుమూసి "నేను బాత్ రూమ్‌లోకి వెళ్ళొస్తాను. బాంయ్ కూడా వొచ్చే వేళయింది. నేను వచ్చేదాకా మేగజైన్ తిరగేస్తుండండి!" అంటూ టీపాయ్‌మీద పత్రికల కట్ట పడేసి బాత్ రూమ్‌కేసి నడిచింది.

మూర్తి కుర్చీలో కూలబడి టీపాయ్‌మీద సున్న పత్రి కల్ని తిరగెయ్యసాగాడు.

పదినిమిషాలు దొర్లిపొయ్యినయ్.

మంచం క్రిందనుండి ఓ ఆకారం మెల్లగా పైకి లేచింది. జొడ్లోంచి బాకు దూసి మూర్తి కెగురుగా నిల్చుని వికటాట్టహాసం చేసింది.

మూర్తి బిత్తరపోయాడు అక్కడ రౌడీ రాజయ్యను చూసి.

"ఏరా ఫుండాకోర్! నాకు దక్కనీయకుండా నా మోహినిని తన్నుకుపోవడానికి తయారయ్యావా! అది నాకు తప్ప మరెవ్వరికి దక్కడానికి వీల్లేదు! నిన్నిప్పుడేం చేస్తానో చూడు!" అంటూ చేతిలోని బాకు పైకెత్తి మీదికి లంఘించాడు.

మూర్తి ఒడుపుగా తప్పించుకోవడం వల్ల అతని ప్రయత్నం ఫలించలేదు. కాని మూర్తి చేతుల్లో ఏమీ లేదు. కత్తి చేతవున్నవాడితో పోరాడడం మాటలు కాదు. అయినా తన శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు మూర్తి అతని చేజిక్కకుండా తప్పించుకొనడానికి.

కాని అతని ప్రయత్నం ఫలించలేదు. గదిలోని వస్తువులు చిందర వందరగా విరిగిపోతున్నాయ్. చివరికి మూర్తి ఆ వ్యక్తి చేతుల్లో చిక్కక తప్పింది కాదు.

వాడు మూర్తిని క్రింద పడవేసి గుండెలమీద కూచున్నాడు. వికటంగా నవ్వి "ఈ దెబ్బతో ఖతం! నా కడ్డువచ్చేవాళ్ళెవరూ లేరు" అంటూ యెడంచేతితో మూర్తి పీకను నొక్కిపట్టి, కుడిచేతిని పైకెత్తాడు.

అంతే! ఏదో సర్రుమని దూసుకువచ్చి అతగాడి గుండెలకు తగిలింది. అతడు "అమ్మా!" అంటూ పక్కకి ఒరిగి

పొయ్యాడు. మూర్తి అతగాడ్ని ప్రక్కకి తోసి లేచి నిల్చున్నాడు.

మోహిని రివాల్వర్ గురిపెట్టి నిల్చునివుంది. క్రిందపడ్డ వ్యక్తి విల విల తన్నుకొని ప్రాణాలు వదిలాడు. అతని గుండెల్లోంచి చిమ్మిన రక్తం అతని తెల్లచొక్కాని తడిపి వేసింది.

"ఎంతపని చేశావు మోహినీ!" అన్నాడు మూర్తి భయంతో గజగజలాడిపోతూ.

"వీడికి జరగవలసిన శాస్తే జరిగింది. ఇక వీడి పీడ వదిలినట్టే!" అంటూ మోహిని తన రివాల్వర్ని వానిటీ బాగ్లో దాచింది. "నేను గదిలో లేకుండా చూచి ఏ మారుతాళంతోనో గదిలోకి చేరివుండొచ్చు" అంది.

మూర్తి గజగజలాడిపోతూ నిల్చుని వున్నాడు. అతని బట్టలు చెమటతో తడిసిపోయినయ్.

కాని మోహినిలో ఎలాంటి కంగారూ కనిపించడం లేదు. చిన్నగా నవ్వి "డోంట్ వర్రీ మిస్టర్ మూర్తీ! వీడ్ని ఎలా 'డిస్పోస్' చెయ్యాలో నాకు బాగా తెలుసు. ఇది యెప్పుడో జరగవలసింది! ఇప్పుడు నెరవేరింది!" అంటూ పక్కకి వెళ్ళి ఓ బ్లాంకెట్టు తెచ్చి వాడిమీద కప్పింది.

మూర్తి మంత్రముగ్ధుడికి మల్లే నిల్చుని చూస్తూ వుండి పొయ్యాడు.

అంతలో యెవరో డోర్ బెల్లు మోగించారు. మోహిని తలుపు తెరిచింది. హోటల్ బాయ్ డిన్నర్కి ఆర్డర్ చేసిన ఐటెమ్స్తో తయారుగా నిల్చుని వున్నాడు.

"అవన్నీ అక్కడ పెట్టి వెళ్ళు! మేం పట్టుకెళతాం లోపలికి" అంది మోహిని, గుమ్మంలో నిల్చుని.

హోటల్ బోయ్ తాను తెచ్చినవన్నీ గుమ్మంముందు పెట్టేసి వెళ్ళిపొయ్యాడు.

"కమాన్ మూర్తీ వాటిని లోపలికి పట్టుకెళ్ళి డిన్నర్ కానిద్దాం! వీడిపని తరువాత చూద్దాం!" అంది హుషారుగా.

"ఈవిడ యెంత గుండెలుతీసిన బంటో!-ఓహత్య చేసి యెంత ధైర్యంగా వ్యవహరిస్తోంది!" అనుకున్నాడు మూర్తి.

"నాకీపూట భోజనం చెయ్యాలని లేదు" అన్నాడు మూర్తి.

ఆమె నవ్వింది. "నువ్వేం మగాడివి! ఈ మాత్రానికే భయపడిపోతే యెలా?" అని ధైర్యం చెప్పసాగింది.

హోటల్ బాయ్ తెచ్చినవన్నీ లోపలికి చేర్చి, గది మధ్య పడివున్న శవాన్ని ఓ పక్కకి లాగి, "కమాన్ మూర్తి! కమాన్!" అంటూ అతగాడ్ని బలవంతంచెయ్యసాగింది.

శవాన్ని గదిలో పెట్టుకుని తినాలంటే అతనికి అసహ్యంగా వుంది. కాని ఆమె బలవంతంలో యింతతిన్నాననిపించి లేచాడు. మోహిని మాత్రం సుష్టుగా భోజనం చేసి బాత్రూములోకెళ్ళింది, చేతులు కడుక్కోడానికి.

ఒంటరిగా కూచున్న మూర్తి దృష్టి గది మధ్య కారిన రక్తంమీద పడింది. మెల్లగా దగ్గరికి వెళ్ళి రక్తం దగ్గర గొంతు కుక్కూచుని పరిశీలించసాగాడు. అంతలో ఆమె గదిలోకి రావడంతో లేచి నిల్చున్నాడు.

"ఏమిటి మూర్తీ! ఏమిటో పరిశీలిస్తున్నట్టున్నావు?" అని ప్రశ్నించింది మోహిని.

"ఏంలేదు. ఇక్కడ కారిన రక్తాన్ని వెంటనే

శుభ్రం చెయ్యాలి. లేకపోతే అనవసరంగా యిరుకులో పడతాం. శవాన్ని యెలా మాయం చేస్తావో నీకే తెలియాలి!" అన్నాడు మూర్తి.

"అదంతా నైట్ వాచర్ చూసుకుంటాడు. మనం అలా వెళ్ళి గాలి మేసేసి వద్దాం పద!" అంటూ అతని చెయ్యి పట్టుకుంది.

అలాగే అన్నట్టు తలూపాడు మూర్తి.

గది తలుపులు మూసి, తాళం పెట్టి మెట్లకేసి నడిచింది మోహిని. మూర్తి ఆమెను అనుసరించాడు. మోహిని నైట్ వాచర్‌తో ఏదో రహస్యంగా మాట్లాడి, తాళం చెవి నైట్ వాచర్ చేతిలో పెట్టి మూర్తిని కలుసుకుంది. ఇద్దరూ చేతులు పట్టుకుని పేవ్ మెంటుమీద నడవసాగారు.

ఇప్పుడు మూర్తి చాలా హుషారుగా వున్నాడు. ఇంత క్రితం అతనిలో చోటుచేసుకున్న 'దిగులు - విచారం' యిప్పుడతనిలో మచ్చుకైనా కనిపించడంలేదు.

ప్రేమికులిద్దరూ అరగంటసేపు అలా షికారు వెళ్ళి గదికి తిరిగి వచ్చేసరికి నైట్ వాచర్ తన పని పూర్తి చేశాడు. గదిలో శవం మాయమైంది. గది శుభ్రంగా వుంది.

మూర్తి తనలో తాను నవ్వుకొన్నాడు.

ఆ ప్రేమికులు 'తొలి' రాత్రిలాగే 'మలి' రాత్రి కూడా ఆనందంగా గడపగలిగారు.

ఆ మరునాడే కంపెనీనుంచి తన్ను అర్జంటుగా వచ్చి ఆఫీసులో కలుసుకోవలసిందిగా వుత్తరం అందింది మూర్తికి.

మూర్తి ఆఫీసుకు వెళ్ళగానే తాను వెంటనే, బయలు

దేరి నిజామాబాద్‌లోని బ్రాంచికి వెళ్ళి చార్జి తీసుకోవలసిందినీ, అక్కడ బ్రాంచి మేనేజర్‌గా పనిచేస్తోన్న వ్యక్తి గుండెపోటువల్ల మరణించడంతో యీ మార్పు చేయవలసివచ్చిందనీ కంపెనీ ప్రొప్రైటర్ తెలియజేశాడు.

మూర్తి మోహినివద్ద సెలవుతీసుకుని ఎకాఎకిన బయలుదేరాడు.

6

మూర్తి నిజామాబాద్ చేరుకుని, చార్జి తీసుకొని ఆఫీసు వ్యవహారాల్లో మునిగిపొయ్యాడు. పనీ, పరిసరాలూ కొత్తకావడం మూలాన కొంతకాలంపాటు రాత్రింబవళ్ళు శ్రమపడపలసి వచ్చింది.

నెలకి జీతం అన్ని అలవెన్సులూ కలుపుకొని రెండువేలదాకా అందుతోంది. కంపెనీవాళ్ళే అన్ని వసతులూ వున్న ఫ్రీ క్వార్టర్సూ, వాడుకోడానికి కారు ఇచ్చారు. అతనికి బాదరబందీ ఏమీ లేకపోవడం మూలాన ఎంత విచ్చలవిడిగా ఖర్చుపెట్టినా ఐదువందలకంటే ఎక్కువ ఖర్చుకావడం లేదు. జీవితం హాయిగా గడిచిపోతోంది.

ఆ సమయంలో మోహినే గనక తన పక్కనుంటే అంతకంటే అదృష్టం మరొకటి వుండబోదు అనుకొనేవాడు. ఆమెతో గడిపిన మధురమైన రాత్రులు అతనికి మాటిమాటికీ గుర్తుకి రావడంవల్ల ఆమె సాహచర్యాన్ని వొదులుకోలేక, రెండు మూడు వుత్తరాలు రాశాడు, ఆమెను ఆహ్వానిస్తూ. కాని ఆమెనుండి యేలాంటి జవాబూ అందలేదు.

ఆరుమాసాలు గడిచిపోయినయ్. మోహినిమీద వున్న మక్కువకొద్దీ మూర్తి అతిప్రయత్నంమీద హైదరాబాద్ బదిలీ చేయించుకున్నాడు. అతడు హైదరాబాద్

చేరుకున్న మరుసటిరోజే మోహినికోసం ఆమె గదికి వెళ్ళాడు. కాని ఆమె దర్శనం లభించలేదు.

ఆమె వూళ్ళో లేదనీ, ఎప్పుడు వస్తుందో తెలీదనీ, నైట్ వాచర్ తాతయ్య ద్వారా తెలుసుకున్నాడు. తన ఆఫీసుఫోన్ నంబర్ నైట్ వాచర్ కిచ్చి ఆమె వూళ్ళోకి రాగానే తనకి ఫోన్ చెయ్యమని చెప్పివెళ్ళాడు.

మరో రెండు వారాలు గడిచిపోయినా ఆమె నుండి తనకి ఎలాంటి కబురూ అందలేదు.

ఒకనాడు తన మిత్రుడొకడు మారేడ్‌పల్లిలో కొత్తగా యిల్లు కట్టుకొన్న సందర్భంలో డిన్నర్‌కి ఆహ్వానించాడు మూర్తిని. డిన్నర్ ముగించుకుని యింటి ముఖం పట్టేసరికి రాత్రి ఒంటిగంట దాటింది. రోడ్డుమీద జన సంచారంలేదు. కారులూ, ఆటోలూ వగైరా వాహనాలు కూడా ఆట్టే నడవడంలేదు.

తన కారు ఓ నాలుగురోడ్లు కలిసే చౌరస్తా చేరుకునేసరికి యెక్కడ్నించో ఓ బులెట్ అతి స్పీడుగా తన కారుని దాటుకొని వెళ్ళింది. దానిలో వెనకసీట్లో కూచుని బులెట్‌ని నడుపుతోన్న వ్యక్తి నడుముని తన కుడిచేత్తో చుట్టి, ఎడంచేత్తో పైకెగిరే పైటను సవరించుకుంటోన్న స్త్రీ ఎవరోకాదు—మోహిని! బులెట్‌ని నడుపుతోన్న వ్యక్తికూడా తనకి బాగా పరిచయమున్న వ్యక్తిలాగే కనిపించాడు.

మూడురోజుల అనంతరం ఒకరోజు ఉదయం పక్కమీంచి లేచి బెడ్‌కాఫీ సిప్ చేస్తూ, పేపరు తిరగేస్తున్న మూర్తి కంటిని బాక్స్ కట్టి ప్రచురింపబడిన ఓ వార్త ఆకర్షించింది.

"మొన్నరాత్రి ఒంటిగంటకి మారేడ్‌పల్లిలోని మంజూలా బాంక్‌లో దొంగలు పడి, వాచ్‌మాన్‌ని స్పృహ తప్పించి ఇనప్పెట్టెను విరగ్గొట్టి, దాదాపు లక్ష రూపాయలు దోచుకు పొయ్యారు.

పోలీసులు దొంగతనం జరిగిన 24 గంటల్లోగా దొంగని యాభై వేల కరెన్సీతోబాటు పట్టుకుని అరెస్టు చేశారు. ఆ దొంగ పేరు రామరాజనీ, అతడు యిలాంటి దోపిడీల్లో రెండు మూడుసార్లు పట్టుబడి జైలుకెళ్ళాడనీ పోలీసులు చెబు తున్నారు.

అతనితోబాటు మరో స్త్రీ కూడా యీ కేసులో పాల్గొన్న దనీ, దోపిడీ చెయ్యబడిన మిగతా యాభై వేలూ ఆమె దగ్గరే, వుంటుందనీ పోలీసుల అనుమానం. పోలీసులు ఆమెకోసం నలుమూలలా గాలిస్తున్నారు. ఈ సందర్భంలో బాంకు మెనేజర్ మోహన్‌రావును అనుమానం మీద అరెస్టుచేశారు."

ఆ వార్త చదవగానే మూర్తి బుర్రలో ఏదో కలుక్కు మన్నట్టయింది. వెంటనే టెలిఫోన్ గైడు తిరగేసి క్రైం బ్రాంచికి ఫోన్ చేసి యేవో వివరాలు తెలుసుకుని తృప్తిగా వూపిరి పీల్చాడు. రిసీవర్‌ని ఫోన్ మీద పెట్టేసి బాత్ రూముకేసి బయలుదేరాడు.

మూర్తి కాలకృత్యాలు తీర్చుకుని బట్టలు తొడు క్కుంటుండగా బంట్రోతు వచ్చి చెప్పాడు. "మీకోసం ఎవరో వచ్చారు సార్. విజిటింగ్ రూములో కూచోబెట్టి వచ్చాను" అని.

మూర్తి గబగబా బట్టలు తొడుక్కుని విజిటర్స్ గది లోకి చేరుకున్నాడు. మోహిని సోఫాలో వాలి అతని కోసమే యెదురు చూస్తోంది.

"హల్లో మోహినీ! ఇంతకాలం యేమయ్యావ్? నీ

కోసం నే నిక్కడికి వచ్చినప్పటి నుండీ ప్రయత్నిస్తున్నాను" అన్నాడు మూర్తి ఆమె కెదురుగా కుర్చీలో కూచుంటూ.

"మీతో ఓ రహస్యం మాట్లాడాలి" అంది మోహిని దిక్కులు చూస్తూ.

"మరేం ఫరవాలేదు. ఇక్కడికెవరూ రారు. ఒక విజిటర్ లోపలుండగా మరో విజిటర్ లోపలికి రావడానికి వీల్లేదు. బంట్రోతులు పంపరు. నువ్వు నిర్భయంగా చెప్పవచ్చు ఆ రహస్య మేమిటో?...." అన్నాడు మూర్తి.

"నాకు అర్జెంటుగా పదివేల రూపాయలు కావాలి" అంది మోహిని.

"పదివేల రూపాయలా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు మూర్తి.

"పదివేలు కాదు. లక్ష!—కాని ఒక్కసారిగా లక్ష రూపాయలు తెమ్మంటే ఎక్కడ్నించి తెస్తావ్? మొదటి యిన్‌స్టాల్‌మెంటు పదివేలు చాలు. మిగతా తొంభై వేలు మెల్లగా వసూలు చేస్తాను."

"ఏమిటి? నా దగ్గరనుండి లక్షరూపాయలు వసూలు చేస్తావా?" అని ప్రశ్నించాడు మూర్తి ఆశ్చర్యంగా.

"అవును."

"ఎందుకు?"

"నీ రహస్యం దాచినందుకు."

"నాకు రహస్యాలేమీ లేవే!"

"ఎందుకులేవూ? వుంది! రౌడీ రాజిగాడ్ని నా రివాల్వర్‌తో చంపలేదూ?"

"ఏమిటి? రాజీగాడ్ని చంపింది నేనా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు మూర్తి.

"నువ్వో నేనో యెవరు చూశారు? నా కోసం నా వెంటబడుతోన్న రాజిగాడ్ని నా ప్రియుడివైన నువ్వు చంపావు—అని నే నంటున్నాను. కాదని నిరూపించగలవా?"

"అయితే నన్ననవసరంగా యీ రొంపిలోకి దించుతున్నావన్నమాట."

"లేదు మిస్టర్ మూర్తీ! నీమీద యీ నేరాన్ని మోపాలనీ నిన్ను పోలీసులపాలు చెయ్యాలనీ నాకే మాత్రం లేదు. నే నడిగిన రొక్కం నా కప్పజెపితే నీకే ఆపదా రాదు. నువ్వు ఓ కంపెనీ మేనేజర్వి. సంఘంలో నీకు మాంచి పలుకుబడి వుంది. నీకీ పదివేలూ వో లెక్కలోది కాదు. నే నడిగిన పైకం నా కప్పజెప్పి సంఘంలో నీ పరువుని కాపాడుకో. నాకీ పైకం మూడు రోజుల్లో కావాలి! నే నర్జెంటుగా వొక చోటుకి వెళ్ళాలి!" అంది మోహిని.

"నువ్వు నన్ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నావా?"

"నువ్వు దానికేం పేరు పెట్టినా నా కభ్యంతరం లేదు! నాకు కావలసింది డబ్బు!"

"డబ్బుకోసం ఏమైనా చేస్తావా?"

మోహిని మాట్లాడలేదు.

మూర్తి లేచివెళ్ళి యెవరికో ఫోన్ చేసి వచ్చి మళ్ళీ కూర్చున్నాడు.

"నువ్వడిగిన పదివేలూ నీ కందజేస్తాను. ఒక్క రాత్రి నువ్వు నాతో గడుపు!"

"షటప్! యూ ఫూల్! నేను వొళ్ళమ్ముకొనే

వ్యభిచారిని కాను."

"ఇంతక్రితం రెండు రాత్రిళ్ళు నీ శరీరాన్ని నా పరం చేశావు గుర్తులేదా?"

"నా శరీరాన్ని డబ్బుకి కుదవబెట్టలేదు. ఇష్టం వుండి కోరిక తీర్చుకొన్నాను."

"మై డియర్, మోహినీ! నేనంటే నీ కిష్టమే కదూ....?"

"కాకపోతే నీతో రెండు రాత్రిళ్ళు గడిపేదాన్ని కాదని యింతక్రితమే చెప్పాను. అర్థంకాలేదా?"

"ముచ్చటగా మూడు రాత్రిళ్ళయినా గడపందే మక్కువ తీరదని నువ్వేగా అన్నావు? మనం గడిపింది రెండే రెండు రాత్రిళ్ళు. ఆ వొక్క రాత్రి కూడా పూర్తి చేసి నా కోరిక తీర్చు—"

"తీరిస్తే పదివేలిస్తావా?"

"పదివేలా?" పకపకా నవ్వాడు మూర్తి. "నా రహస్యాన్ని నువ్వు కాపాడుతున్నందుకా—మ్—?" తమాషాగా ప్రశ్నించాడు.

ఆమె తీక్షణంగా అతనికేసి చూస్తూ "అవును" అన్నట్టు తలూపింది.

"అసలు రాజయ్య హత్య చెయ్యబడితేగా, అది రహస్యమవుతుంది?" అని ప్రశ్నించాడు మూర్తి.

"రాజయ్య హత్య చెయ్యబడడం నువ్వు చూడలేదా?"

"మన విషయం కాదు నేనంటున్నది? రాజయ్య హత్య చెయ్యబడ్డ విషయం పత్రికల్లో ప్రచురింపబడలేదు. అటు ప్రజలుగానీ, ఇటు పోలీసులు గానీ అనుమానించలేదు. అసలు అతని శవాన్ని సైతం ఎవరూ చూడలేదు.

అలాంటప్పుడు రాజయ్య హత్య చెయ్యబడ్డాడంటే ఎవరు నమ్ముతారు?" అన్నాడు మూర్తి.

"అవును. నైట్ వాచర్ తాతయ్య అతని శవాన్ని యెవరికంటా పడకుండా దాచేశాడుగనక అతని హత్యను గురించి ఎవరూ అనుమానించలేదు. హత్య జరిగినప్పుడు చూచినవాళ్ళూ, శవాన్ని దాచినవాళ్ళూ సాక్ష్య మివ్వడానికి సిద్ధంగా వున్నప్పుడు రాజయ్య హత్యచెయ్యబడ్డాడన్న విషయాన్ని నిరూపించడం అతి కష్టమైన పనేం కాదు" అంది మోహిని.

"హతుడు పోలీసుల కస్టడీలో సురక్షితంగా వున్నప్పుడు హతం చెయ్యబడ్డాడని ఎందరు సాక్ష్యమిచ్చినా ప్రయోజనం వుండదు."

"ఏమిటి? రాజయ్య పోలీసులకస్టడీలో వున్నాడా?" కంగారుగా ప్రశ్నించింది మోహిని.

"అవును. మాచేడ్ పల్లిలోని మంజులాబాంక్ లో లక్ష రూపాయలు దొంగిలించినందుకు పోలీసులు అతడ్ని అరెస్టు చేశారు. అతని అసలు పేరు రామరాజు. ఇనప్పెట్టెలు పగలగొట్టడంలో ఆరితేరిన చెయ్యి. ఇంత క్రితం రెండు మూడుసార్లు జెయిలుకి గూడా వెళ్ళొచ్చాడు. ప్రస్తుతం వేషం మార్చి రౌడీ రాజయ్యగా చలామణీ అవుతున్న వ్యక్తే రామరాజు!"

"వాట్?" మోహని ఆశ్చర్యంగా చూచింది.

"అతని పార్టనర్ రీటా అనే స్త్రీకోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆమె కూడా అతనిలాగే పేరు మార్చి పోలీసుల కంటబడకుండా తప్పించుకొని తిరుగుతోందనీ, ఆమె ప్రస్తుత నామధేయం మిస్ మోహినీదేవి అనికూడా పోలీసులికి తెలుసు!"

మోహిని దెబ్బ తిన్న ఆడ సింహంలా కంగారు పడింది.

మూర్తి వికటంగా నవ్వాడు. "మోహినీదేవిగారూ! నువ్వూ ఆ రామరాజూ కలిసి నన్ను వంచించేందుకు ఆడిన నాటకం నా కర్థంకాకపోలేదు. నువ్వు అతగాడిమీదికి పేల్చింది ఫాల్స్ బులెట్ అనీ, అతని గుండెల్లోంచి కారిన రక్తం రంగునీళ్ళనీ నేనా నాడే గుర్తించాను. మీ పాపం పండింది! పోలీసులు యిప్పుడో, మరుక్షణమో నిన్ను అరెస్టుచేసి నీ పార్టనర్ దగ్గిరికి పంపడానికి సన్నాహాలు చేస్తున్నారు" అన్నాడు. "మీ తోడుదొంగ తాతయ్యని యీపాటికి అరెస్టుచేసి వుండొచ్చు!"

మోహిని చటుక్కున లేచి పరుగెత్తింది. మూర్తి పరుగెత్తి ఆమెను పట్టుకొన్నాడు. ఆమె గింజుకో సాగింది.

అంతలో డోర్ బెల్లు మోగింది. మూర్తి తలుపు తెరిచాడు. పోలీసులు ప్రత్యక్షమయ్యారు.

క్రైంబ్రాంచి ఇన్స్పెక్టర్ రీటా చేతులికి బేడీలు తొడుగుతూ "మీ సహాయానికి మా కృతజ్ఞతలు మిస్టర్ మూర్తీ! మీరీ సాయం చేసివుండకపోతే మేమీ మాయ లేడీని పట్టుకోవడంలో మరికొంత శ్రమపడవలసి వచ్చేది! చాలా థాంక్స్!" అన్నాడు.

కామించిన కాంతను కటకటాల్లోకి పంపేందుకు మనసొప్పకపోయినా, ఆ కాంత కాలాంతకురాలని తెలిసిం తరువాత మూర్తి మనసు కుదుటపడింది.

—:ఐపోయింది:—